క్లుప్తంగా

నేడు ఎమ్మెల్యే రాక

శాయంపేట : మండల కేంద్రంలోని ఎస్వీకేకే ఫంక్షన్ హాల్‌లో కాంగ్రెస్ పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించే ముఖ్య కార్యకర్తల సమావేశానికి భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు హాజరు కానున్నట్లు కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు దూదిపాల బుచ్చిరెడ్డి శుక్రవారం ప్రకటనలో తెలిపారు. మండలంలోని నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని పిలుపునిచ్చారు.

సరోత్తంరెడ్డిని గెలిపించాలి



ఆత్మకూరు : ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా బీజేపీ బలపర్చిన అభ్యర్థి సరోత్తంరెడ్డిని గెలిపించాలని కోరుతూ బీజేపీ మండల శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటర్లను కలిసి ఓటు అభ్యర్థించారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డాక్టర్ సిరంగి సంతోశ్ కుమార్, మండల అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, నాయకులు రాజు, బుచ్చిరెడ్డి, సత్యనారాయణ, పైడి ఆచార్య, మహేందర్ పాల్గొన్నారు.

బడ్జెట్‌లో విద్యారంగానికి నిధులు కేటాయించాలి

హన్మకొండ: అసెంబ్లీ ఎన్నికల మేనిఫెస్టోలో కాంగ్రెస్ పార్టీ విద్యారంగానికి 15 శాతం నిధులు కేటాయిస్తామని ఇచ్చిన హామీ మేరకు బడ్జెట్‌లో కేటాయింపులు చేయాలని దళిత బహుజన ఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షుడు రౌతు రమేశ్ కుమార్ డిమాండ్ చేశారు. 2024–25 ఆర్థిక సంవత్సరం బడ్జెట్‌లో కేవలం 7 శాతం నిధులు మాత్రమే కేటాయించారని ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వచ్చే 2025–26 బడ్జెట్‌లోనైనా 15 శాతం నిధులు కేటాయించి మాట నిలబెట్టుకోవాలన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలలో కనీస వసతులు కరువై విద్యార్థులు సమస్యల మధ్య చదువులు సాగిస్తున్నారని అసర్ నివేదిక స్పష్టం చేసిందని గుర్తు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన 2024 అబ్‌స్ట్రాక్ నివేదిక ప్రకారం 11.95 శాతం పిల్లలు డ్రాప్ అవుట్‌గా మారి బడి బయట ఉన్నారని పేర్కొందని వివరించారు. ప్రభుత్వ విద్యాలయాల్లో నాణ్యమైన సమాన విద్యను అందించాలని కోరారు.

గంజాయి పట్టివేత

ఖిలా వరంగల్ : అక్రమంగా 750 గ్రాముల గంజాయిని తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేసినట్లు మిల్స్‌కాలనీ ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. శుక్రవారం సాయంత్రం వరంగల్–కరీమాబాద్ రహదారిపై ఎస్సై ఆధ్వర్యంలో వాహన తనిఖీలు నిర్వహిస్తున్నారు. కరీమాబాద్‌కు చెందిన నీలం శ్రీనివాస్, బొరిశెట్టి మణిదీప్ హనుమకొండలోని శివ వద్ద 750 గ్రాములు ఎండు గంజాయిని కొనుగోలు చేసి బైక్‌పై బయల్దేరారు. ఈక్రమంలో కరీమాబాద్ రోడ్డుపై వాహన తనఖీలు నిర్వహిస్తుండగా అనుమానం వచ్చి బ్యాగు పరిశీలించగా గంజాయి లభించింది. వెంటనే వారిని అదుపులోకి తీసుకుని విచారించగా హనుమకొండలోని శివ వద్ద కొనుగోలు చేసి తిరిగి విక్రయించేందుకు కరీమాబాద్‌కు బయల్దేరామని నిందితులు విచారణలో పేర్కొన్నారు. నిందితులను అరెస్ట్ చేసి వారిపై కేసు నమోదు చేసి గంజాయిని స్వాధీన పర్చుకున్నట్లు ఎస్సై తెలిపారు.

నిందితులకు శిక్షపడేలా చూడాలి

హన్మకొండ చౌరస్తా : తనపై దాడి చేసి హత మార్చేందుకు యత్నించిన నిందితులతో పాటు అందుకు పురిగొల్పిన వారికి శిక్ష పడేలా చూడాలని యువజన కాంగ్రెస్ నాయకుడు తోట పవన్ శుక్రవారం బాలసముద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డిని కలిసిన లిఖిత పూర్వకంగా వినతిపత్రాన్ని అందజేశారు. నాటి బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో అప్పటి ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్, అతని కుటుంబ సభ్యులు, కార్పొరేటర్ల అగడాలు, అక్రమాలను అడుగడుగునా నిలదీశానని అది మింగుడు పడని వినయ్ భాస్కర్ అప్పటి కార్పొరేటర్ సోదా కిరణ్, బీఆర్ఎస్ నాయకుడు రంజిత్‌రెడ్డి అనచరులతో హత్యాయత్నం చేశారని పేర్కొన్నారు.

రూట్ సర్వే చేసి న్యాయం చేయాలి

హన్మకొండ : హనుమకొండ అలంకార్ కూడలిలో రోడ్డు మరమ్మతులో భాగంగా బస్సులను రూట్ మళ్లించి నడుపుతున్నారని, దీంతో కిలో మీటర్లు పెరిగి నష్టపోతున్నామని వెంటనే రూట్ సర్వే చేసి తమకు న్యాయం చేయాలని ఆర్టీసీ హైర్ బస్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ వరంగల్ రీజియన్ చైర్మన్ మారిపల్లి రాంరెడ్డి కోరారు. శుక్రవారం హనుమకొండలో ఆర్టీసీ వరంగల్ ఆర్ఎం డి.విజయభానుకు వినతిపత్రం అందించారు. హనుమకొండ జిల్లా బస్‌స్టేషన్ నుంచి పరకాల, భూపాలపల్లి, ములుగు, ఏ టూరునాగారం, నర్సంపేట, మహబూబాబా ద్ రూట్‌లో వెళ్లే బస్సులు మళ్లించిన రూట్‌లో రాకపోకలు సాగించడం ద్వారా 8 కిలోమీటర్లు పెరుగుతుందని వివరించారు. దీంతో తాము నష్టపోతన్నామని తెలిపారు.

ప్రమాదమని తెలిసినా పట్టించుకోరా..?



బ్రిడ్జి వద్ద అలుముకున్న చీకటి



ప్రమాదకరంగా ఉన్న డైవర్షన్ రోడ్డు, పక్కన పిల్లర్ల గుంతలు

- బ్రిడ్జి నిర్మాణం వద్ద కానరాని సూచిక బోర్డులు
- రాత్రివేళ ప్రయాణానికి జంకుతున్న వాహనదారులు
- చర్యలు చేపట్టని అధికారులు

నడికూడ : మండల కేంద్రంలోని గొల్లపల్లి రోడ్యాంపై బ్రిడ్జి నిర్మాణం పనులు చేపట్టారు. కానీ ఎలాంటి రక్షణ చర్యలు తీసుకోకపోవడంతో వాహనదారులు భయాందోళన చెందుతున్నారు. బ్రిడ్జి నిర్మాణ పనులు జరుగుతున్నట్లు హెచ్చరిక, సూచిక బోర్డులు, రేడియం స్టిక్కర్లు అంటికపోవడంతో రాత్రివేళల్లో ప్రయాణించే వాహనదారులు జంకుతున్నారు. రోడ్డు డైవర్షన్ కోసం మట్టిరోడ్డు ఏర్పాటు చేయగా ఎడమవైపు వ్యవసాయ బావి, కుడివైపున మట్టి రోడ్డుకు ఆనుకుని 20 ఫీట్ల లోతుతో పిల్లర్స్ కోసం గుంతలు తీశారు. కానీ రోడ్డు డైవర్షన్ చేస్తున్నట్లు, బ్రిడ్జి నిర్మాణ పనులు జరుగుతున్నట్లు సదరు కాంట్రాక్టర్ ఎలాంటి సూచికలు ఏర్పాటు చేయకపోవడంతో వాహనాదారులు అదుపు తప్పితే భారీ ప్రమాదం జరిగే అవకాశం ఉందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాత్రి సమయంలో వీధిలైట్లు లేకపోవడం, హెచ్చరికగా రేడియం స్టిక్కర్లు ఏర్పాటు చేయకపోవడంతో వాహనదారులు అటువైపు వెళ్లాలంటే హడలిపోతున్నారు. మండల కేంద్రం నుంచి హనుమకొండ, వరంగల్‌కు వెళ్లే ప్రధాన రహదారి కావడంతో రాత్రి, పగలు నిత్యం వాహనాల రద్దీ ఉంటుంది. రాత్రి సమయంలో వరంగల్ మార్కెట్‌కు లోడ్ వాహనాలు వెళ్తుంటాయని, డైవర్షన్ చేసినట్లు కనిపించడం లేదని అదుపు తప్పితే పిల్లర్ల గుంతల్లో పడిపోవాల్సిన పరిస్థితి ఉందని వాహనదారులు వాపోతున్నారు. ఇప్పటికైనా బ్రిడ్జి నిర్మాణించే కాంట్రాక్టర్, అధికారులు స్పందించి హెచ్చరిక, సూచిక, రేడియం స్టిక్కర్లు అంటించాలని పలువురు వాహనదారులు, స్థానికులు కోరుతున్నారు.



కానరాని హెచ్చరిక బోర్డులు, రేడియం స్టిక్కర్లు

లైట్లు ఏర్పాటు చేయాలి



నూతన బ్రిడ్జి నిర్మాణం చేసే చోటు విద్యుత్ లైట్లు ఏర్పాటు చేయాలి. రాత్రి సమయంలో చీకటిగా ఉండడంతో వాహనాదారులు, పాదాచారులు ప్రమాదాల బారిన పడే అవకాశం ఉంది. అధికారులు, సదరు కాంట్రాక్టర్ వెంటనే చర్యలు చేపట్టాలి.

- కొమ్ము అఖిల్, నడికూడ

రాత్రివేళ ప్రయాణం ప్రమాదం



బ్రిడ్జి నిర్మాణానికి ముందు వీధిలైట్లు ఉండేవి. కానీ వాటిని తొలగించారు. రాత్రి సమయంలో వాహనదారులు భయాందోళన చెందుతున్నారు. విద్యుత్ లైట్లు, సూచిక బోర్డులు, రేడియం స్టిక్కర్లు ఏర్పాటు చేయాలి.

- కొక్కిరాల దేవేందర్‌రావు, నడికూడ

జాతి మనుగడకు మాతృభాష దోహదం



పరకాల : మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ డాక్టర్ సంతోశ్‌కుమార్

- ప్రిన్సిపాల్ డాక్టర్ సంతోశ్‌కుమార్

పరకాల : మాతృభాష అమృతం లాంటిదని, ఏలాంటి పరిస్థితుల్లోనైనా మాతృభాషను మరువకూడదని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సంతోశ్‌కుమార్ తెలిపారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో తెలుగు విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం అంతర్జాతీయ భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ సంతోశ్‌కుమార్ మాట్లాడుతూ.. సాహిత్య వారసత్వ సంపదకు, జాతి మనుగడకు మాతృభాషా ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగు విభాగం అధిపతి అశోక్ మోరె, అధ్యాపకులు ఈశ్వరయ్య, డాక్టర్ విజయ్‌పాల్‌రెడ్డి, డాక్టర్ అశోక్, డాక్టర్ రమేశ్, డాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, డాక్టర్ జగదీశ్‌బాబు, మహేందర్, సమ్మయ్య, డాక్టర్ పావని, డాక్టర్ కల్పన, రాజశ్రీ, డాక్టర్ స్వప్న పాల్గొన్నారు.



కమలాపూర్ : మాట్లాడుతున్న హెచ్ఎం

కమలాపూర్ : మాతృభాషను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని, తెలుగు భాష పండితులు, భాషోపాధ్యాయులు, సాహిత్యపరులు, భాషాభిమానులు భారీ ఎత్తున తెలుగు వెలుగు కార్యక్రమాలు అన్ని పాఠశాలల్లో నిర్వహించాలని హెచ్ఎం సత్యనారాయణ అన్నారు. గూడూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలుగు భాషా అంతరించిపోయే ప్రమాద ఘంటికలు మోగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. మాతృభాషా దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు పాటలు, నృత్యాలు, వ్యాసరచన, ఉపన్యాస పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు. ఉపాధ్యాయులు సంధ్యారాణి, నరసింహాచారి, అనిల్, కృష్ణకుమార్ నాయుడు, రామచంద్రమూర్తి, జయ, లలిత, భిక్షపతి, భాస్కర్, మాధురి, పాఠశాల సహాయకుడు సిద్ధార్థ ఉన్నారు.

మాజీ ఎమ్మెల్యేపై ఆరోపణలు మానుకోవాలి

శాయంపేట : భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డిపై కాంగ్రెస్ నేతలు చేస్తున్న ఆరోపణలు మానుకోవాలని మైలారం మాజీ సర్పంచ్ అరికిల్ల ప్రసాద్ సూచించారు. రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సైతం ఆరోపణలు చేయడం విడ్డూరంగా ఉందని తెలిపారు. మండల కేంద్రంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డిపై రాజకీయ దురుద్దేశంతో సబంధంలేని కేసుల్లో ఇరికించే కుట్ర పన్నుతున్నారని మండిపడ్డారు. బీఆర్‌ఎస్ పార్టీ, మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డికి ప్రజల్లో వస్తున్న ఆదరణను చూసి ఓర్వలేక భూపాలపల్లిలో రెండురోజుల క్రితం జరిగిన రాజలింగమూర్తి హత్యని రాజకీయం చేసి కావాలని మేడిగడ్డ బారేజ్ విషయంలో కోర్టు ఉన్న కేసును మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు, మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డిపై అంటగట్టాలని చూస్తున్నారని అన్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ పార్టీ నాయకులు అసత్య ఆరోపణలు మానుకుని ప్రజాపాలన చేయాలని హితవుపలికారు. ఈ కార్యక్రమంలో నాయకులు కొమ్ముల శివ, గడిపె విజయ్‌కుమార్, మారేపల్లి మోహన్, కరణ్‌బాబు, భాస్కర్, వెంకట్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రసాద్

విద్యార్థులు లక్ష్యం చేరేవరకూ శ్రమించాలి

- సీడబ్ల్యూసీ సభ్యుడు దామోదర్

పరకాల : విద్యార్థులు ఎంచుకున్న లక్ష్యాన్ని సాధించే వరకు శ్రమించాలని అప్పుడే ఉన్నతంగా ఎదుగుతారని చైల్డ్ వేల్ఫేర్ కమిటీ సభ్యుడు కజాంపురం దామోదర్ అన్నారు. పట్టణంలోని రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగుల భవనంలో శుక్రవారం జరిగిన సంస్కార వికాస శిక్షణ కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. విద్యార్థులు ప్రణాళికబద్ధంగా ముందుకెళ్లాలని, చదువుపై దృష్టి సారించి పుస్తకాలతో కుస్తీ పట్టాలని అన్నారు. పేద వర్గాల నుంచి వచ్చిన విద్యార్థులు ఉన్నతంగా ఎదగాలంటే ఉన్నతమైన ఆలోచనలు కలిగిఉండాలన్నారు. లక్ష్యాన్ని చేరుకునే క్రమంలో ఎదురయ్యే సమస్యలను తట్టుకోవాలని, పక్కదారి పట్టించే అవాంతరాలను లెక్కచేయకుండా ఆత్మస్థైర్యంతో ఉండాలని అన్నారు. వ్యక్తిత్వానికి మచ్చతెచ్చే అసాంఘిక మార్గాలకు దూరంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సిటిజన్స్ వేల్ఫేర్ అసోసియేషన్ కార్యదర్శి తేరాల యుగేందర్, తాడూరి లక్ష్మీనారాయణ, ప్రిన్సిపల్ వీరలక్ష్మి, ప్రభాకర్‌రెడ్డి, నర్సింహారాములు, వెంకన్న, విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న దామోదర్

ఉపాధి హామీ పనులు పూర్తిచేయాలి

- ఎంపీడీఓ ఆంజనేయులు

పరకాల : మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా మంజూరైన పనులను త్వరగా పూర్తిచేయాలని మండల పరిషత్ అభివృద్ధి అధికారి పెద్ది ఆంజనేయులు కోరారు. శుక్రవారం మండలంలోని నాగారం, లక్ష్మీపురం, పైడిపల్లి గ్రామాల్లో ఉపాధి హామీ పథకం ద్వారా చేపడుతున్న పౌల్ట్రీ షెడ్డులు, క్యాటిల్ షెడ్, నర్సరీ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ ఆదేశాల మేరకు ప్రతి గ్రామంలో కనీసం 50 మంది కూలీలు పనికి వచ్చేలా చూడాలని పంచాయతీ కార్యదర్శులను, ఫీల్డ్ అసిస్టెంట్లను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు రిజ్వానా, దినేష్, ఫీల్డ్ అసిస్టెంట్‌లు కోమల, చిరంజీవి పాల్గొన్నారు.



పనులు పరిశీలిస్తున్న ఎంపీడీఓ ఆంజనేయులు

అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలి

- మున్సిపల్ కమిషనర్‌కు ఫిర్యాదు

పరకాల : మున్సిపల్ పరిధిలో జరుగుతున్న అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని సీపీఎం పట్టణ కార్యదర్శి బొచ్చు కల్యాణ్ డిమాండ్ చేశారు. మున్సిపాలిటీ పరిధిలో అత్యధికంగా 4,9,15,18,19 వార్డుల్లో అనుమతులు లేకుండా అక్రమ నిర్మాణాలు జరుగుతున్నా టౌన్ ప్లానింగ్ అధికారులు పట్టించుకోవడం లేదంటూ శుక్రవారం మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్‌కు ఫిర్యాదు చేశారు. అక్రమ నిర్మాణాలపై తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం పట్టణ కార్యదర్శి బొచ్చు కల్యాణ్, హేమంత్, ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.



మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

ఆదిదేవుడు శివుడి జ్ఞాపకమే శివరాత్రి

- కోస్తాంధ్ర, తెలంగాణ ఇన్‌చార్జ్ సవిత

పరకాల : శివరాత్రి ఉపవాసమంటే మనస్సులో నిరంతరం శివుడిని జ్ఞాపకం చేసుకోవడమేనని ప్రజాపిత బ్రహ్మకుమారీ ఈశ్వరీయ విశ్వవిద్యాలయం కోస్తాంధ్రా, తెలంగాణ ఇన్‌చార్జ్ రాజయోగిని సవిత అన్నారు. పట్టణంలోని బ్రహ్మకుమారీ కేంద్రంలో శివరాత్రి ఉత్సవాల ప్రారంభోత్సవం సందర్భంగా బ్రహ్మకుమారీలను, సందర్శకులను ఉద్దేశించి మాట్లాడారు. ప్రతి మనిషిలోఉన్న చెడు అలవాట్లను శివుడికి అప్పగించడమే నిజమైన అభిషేకమని అభిప్రాయపడ్డారు. లోకకల్యాణ కోసం ప్రతి ఒక్కరూ చెడును వీడి ఆత్మీయత, ప్రేమానురాగాలతో జీవించాలని కోరారు. ఈ కార్యక్రమంలో చైతన్య స్కూల్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌రెడ్డి, డాక్టర్ కాశయ్య, పరకాల బ్రాంచి ఇన్‌చార్జ్ విజయలక్ష్మి, హనుమకొండ శాఖ ఇన్‌చార్జ్ విమల, బ్రహ్మకుమారీలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సవిత

సమాజాన్ని చైతన్యపర్చడంలో జర్నలిస్టులు కీలకం

కేయూ క్యాంపస్: సమాజాన్ని చైతన్యపర్చడంలో జర్నలిస్టుల పాత్ర ఎంతో కీలకమని కాకతీయ యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య వి.రామచంద్రం అన్నారు. శుక్రవారం యూనివర్సిటీలోని జర్నలిజం విభాగంలో జర్నలిజం విద్యార్థులతో నిర్వహించిన ఫ్రెషర్స్‌డేలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. జర్నలిజం విద్యార్థులకు లీడర్‌షిప్ క్వాలిటీస్ కూడా ఉంటాయన్నారు. సమస్యల పరిష్కారానికి పాటుపడుతారన్నారు. జర్నలిజం విభాగంలోని పలు సమస్యల పరిష్కారానికి తనవంతుగా కృషి చేస్తానన్నారు. యూనివర్సిటీ కాలేజీ ప్రిన్సిపాల్ ఆచార్య టి.మనోహర్ మాట్లాడుతూ విద్యార్థులు రెగ్యులర్‌గా తరగతులకు హాజరు కావాలన్నారు. సమావేశంలో కేయూ జర్నలిజం విభాగం అధిపతి డాక్టర్ సంగని మల్లేశ్వర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రిజిస్ట్రార్ రామచంద్రం

క్రేన్ ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి



వెంకటయ్య ఫైల్

ఎల్కతుర్తి : భీమదేవరపల్లి మండలం గట్లనర్సింగాపూర్ గ్రామంలో గురువారం జరిగిన క్రేన్ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వేల్పుల వెంకటయ్య (55) వరంగల్ ఎంజీఎం ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందాడు. ఎస్సై సాయిబాబు తెలిపిన వివరాల ప్రకారం.. నల్లగొండ జిల్లా నుంచి వలస వచ్చిన గండికోట ఎల్లయ్య(70) గురువారం క్రేన్ నడుపుతుండంగా ప్రమాదవశాత్తు క్రేన్ బావిలో పడి ఎల్లయ్య అక్కడికక్కడే మృతిచెందగా మరో వ్యక్తి గట్ల నర్సింగాపూర్ గ్రామానికి చెందిన వేల్పుల వెంకటయ్య తీవ్రంగా గాయపడిన విషయం తెలిసిందే. కాగా వెంకటయ్యను చికిత్స నిమిత్తం 108 వాహనంలో వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతున్న వెంకటయ్య పరిస్థితి విషమించి మృతిచెందినట్లు ఎస్సై తెలిపారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు



కమలాపూర్ : మండలంలోని వంగపల్లి గ్రామ శివారులో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. 108 సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం.. జయశంకర్ భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండలం రామకృష్ణాపూర్‌కు చెందిన నాంపెల్లి మహేష్ (35) మండలంలోని మర్రిపల్లిగూడెంలో తాపీ మేస్త్రీ పనికి వచ్చాడు. అక్కడ నుంచి తన బైక్‌పై పరకాలకు వెళ్తుండగా వంగపల్లి గ్రామ శివారులోకి రాగానే గుర్తుతెలియని వాహనం ఢీకొట్టి వెళ్లింది. ఈ ప్రమాదంలో మహేష్‌కు తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న 108 సిబ్బంది క్షతగాత్రుడికి ప్రథమ చికిత్స అందిస్తూ వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించినట్లు 108 సిబ్బంది ఈఎంటీ బండ ఉపేందర్, పైలెట్ కుమారస్వామి తెలిపారు. కాగా మహేష్ పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది.

గీతకార్మికుడికి..



నడికూడ : తాటిచెట్టుపై నుంచి పడి గీత కార్మికుడుకి గాయాలయ్యాయి. ఈ సంఘటన మండలంలోని ధర్మారం గ్రామంలో గురువారం సాయంత్రం చోటు చేసుకుంది. స్థానికుల తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన పల్లె రవీందర్ రోజు మాదిరిగానే కల్లు తీసేందుకు గ్రామ శివారులో గల తాటిచెట్టు ఎక్కుతున్నాడు. ఈ క్రమంలో చెట్టుపై నుంచి జారి కిందపడ్డాడు. దీంతో అతని చెయ్యి విరిగినట్లు తెలిపారు. చికిత్స నిమిత్తం పరకాలలోని ఓ ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు.

వాడవాడన ఫాగింగ్ చేపట్టాలి

పరకాల : దోమల నివారణకు మున్సిపల్ పరిధిలోని 22 వార్డుల్లో గల వాడవాడన ఫాగింగ్ చేపట్టాలని సానిటేషన్ అధికారులను మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్ ఆదేశించారు. శుక్రవారం రాత్రి పట్టణంలోని సీఎస్‌ఐ కాలనీలో దోమల ఫాగింగ్ పనులను ఆయన పర్యవేక్షించారు. ఈ సందర్భంగా సానిటేషన్ అధికారులకు, సిబ్బందికి సూచనలు పలు చేశారు.



ఫాగింగ్ పనులను పర్యవేక్షిస్తున్న మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్

ప్రసన్న హరికృష్ణను ఎమ్మెల్సీగా గెలిపించండి



ప్రసన్న హరికృష్ణకు మద్దతుగా ప్రచారం నిర్వహిస్తున్న ప్రశాంత్, బీసీ సంఘం నాయకులు

కమలాపూర్ : కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, మెదక్ జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీగా పోటీ చేస్తున్న ప్రసన్న హరికృష్ణను గెలిపించాలని బీఎస్పీ నాయకుడు పల్లె ప్రశాంత్ కోరారు. మండలంలోని గోపాల్‌పూర్, శనిగరం, మాదన్నపేట, గూనిపర్తి గ్రామాల్లో శుక్రవారం ప్రసన్న హరికృష్ణకు మద్దతుగా బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పట్టభద్రుల ఇంటింటికి వెళ్లి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యావంతుడు, నిరుద్యోగ యువకుల పక్షాన ప్రశ్నించే గొంతుకగా నిలిచే హరికృష్ణ ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనారిటీ వర్గాల మద్దతుతో పట్టభద్రుల ఎమ్మెల్సీగా పోటీ చేస్తున్నారని, ఆయనకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. బీసీ సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడు రమేశ్, ఎమ్మెల్సీ ఎన్నికల మండల ఇన్‌చార్జ్ తిరుపతి, నాయకులు రవి, రమేశ్, కృష్ణ, సతీశ్, అశోక్, సత్యం, ఐలయ్య, రమేశ్, రవీందర్ పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి దాతలు సహకరించాలి

- ఎంపీడీఓ అనిల్ కుమార్

ధర్మసాగర్ : విద్యాభివృద్ధికి దాతలు సహకరించాలని ఎంపీడీఓ అనిల్ కుమార్ అన్నారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన డాక్టర్ అబ్దుల్ కలాం టీచింగ్, లెర్నింగ్ సెంటర్‌కు పెద్దపెండ్యాల ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు చాడ మల్లారెడ్డి, తాటికాయల ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బొద్దిరెడ్డి వెంకటేశ్వర్‌రెడ్డి శుక్రవారం కుర్చీలు, ఫ్యాన్లు, గ్రీన్ బోర్డులు అందించారు. ఈ సందర్భంగా వారిని ఎంపీడీఓ ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ రాంధన్, మండలంలోని వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు రాజేందర్, మురళి, శ్రీనివాస్, ధర్మప్రకాశ్, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



దాతలను సన్మానిస్తున్న ఎంపీడీఓ

విజ్ఞాన, విహార యాత్రకు వెళ్లిన విద్యార్థులు



నిట్‌ను సందర్శించిన విద్యార్థులు

శాయంపేట : మండల కేంద్రంలోని సాంఘీక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల, కళాశాల విద్యార్థులు పీఎంశ్రీ పథకంలో భాగంగా శుక్రవారం హనుమకొండలోని నిట్, చారిత్రక కట్టడమైన వేయి స్తంభాల గుడి, వరంగల్‌లోని భద్రకాళీ ఆలయం, సైన్స్ మ్యూజియం, జంతు ప్రదర్శనశాల, ఓరుగల్లు కోట తదితర పర్యాటక ప్రాంతాలను సందర్శించారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు చారిత్రక కట్టడం వేయి స్తంభాల గుడి, ఓరుగల్లు కోట గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రజని, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.